క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

తుని: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలపై గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ప్రజలు 73827 81490 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలపాలని కోరారు.

ఏలేరులో తగ్గుతున్న నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో ఏలేరు జలశయంలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. దిగువ ఆయకట్టుకు నీటి సరాఫరా తగ్గించారు. బుధవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు గాను 76.51 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 9.71 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువ ఆయకట్టు, పంపా, తిమ్మరాజుచెరువుకు నీటి సరాఫరా నిలిపి వేశారు.

అన్నసమారాధన

రౌతులపూడి: గ్రామంలో నూకాంబికా అమ్మవారి ఆలయశిఖర ప్రతిష్ఠను పురస్కరించుకుని బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించగా స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు మండల సమావేశం

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య బుధవారం తెలిపారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



తునిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

తుని: ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తుని, పాయకరావుపేట పట్టణాల్లో ప్రయాణికులకు బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే పక్షులకు నీటి కోసం మట్టి పాత్రల పంపిణీ చేసినట్టు రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కిశోర్ రెడ్డి తెలిపారు. తుని పట్టణం మార్కెట్ రోడ్, పాయకరావుపేట మెయిన్ రోడ్డులో 7 వేల మందికి మజ్జిగ, 200 మట్టి పాత్రలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, కె.నారాయణరెడ్డి, ఎం.వెంకట రాజారెడ్డి, టి.సోమనాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, మణికంఠరెడ్డి, రెడ్డి సరస్వతి, సరస్వతి సేవా సమితి అధ్యక్షుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి



జెడ్.రాగంపేటలో స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భారతీయ ధర్మపరిషత్ ప్రతినిధులు

గండేపల్లి: గోవును జాతీయ జంతువుగా ప్రకటించి, గోవుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీకి చెందిన ముఖేష్ స్వామీజీ పలు రాష్ట్రాల్లోని జ్యోతిర్లింగాలను దర్శిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మండలంలోని జెడ్.రాగంపేట చేరుకున్న స్వామీజీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గో సంతతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 45 సంవత్సరాల సంసార జీవితాన్ని విడిచి దైవానుగ్రహం కోసం పాదయాత్ర చేస్తున్నట్టు స్వామీజీ పేర్కొన్నారు. 9 నెలల క్రితం ప్రారంభించిన ఈ పాదయాత్రలో ఇప్పటికే 7000 కిలోమీటర్లు పూర్తి చేసినట్టు తెలిపారు. వైద్య పరీక్షలు అనంతరం సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకుని స్వామీజీ పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో సాయి కుమార్, వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

- ప్రధాన రహదారుల్లో తరచూ యాక్సిడెంట్లు
- రోడ్లకు ఇరువైపులా పెరిగిన తుప్పలు
- కొరవడిన హెచ్చరిక బోర్డులు
- వాహనదారులకు ఇక్కట్లు



తామరాడ వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు



శృంగరాయునిపాలెం-తామరాడ ప్రధాన రహదారిపై మలుపు

కిర్లంపూడి: నియోజకవర్గంలోని పలు రహదారుల్లో మలుపులు ప్రమాదానికి పిలుపులుగా మారాయి. ప్రధానంగా కిర్లంపూడి-తామరాడ ప్రధాన రహదారిలో 15.5 కిలో మీటర్ల పొడవున సుమారు 25 ప్రమాదకర మలుపులు ఉన్నాయి. చిల్లంగి, గెద్దనాపల్లి, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, తామరాడ, రామచంద్రపురం, గోనేడ, పాలెం, సోమరాయణంపే, బూరుగుపూడి గ్రామాల మీదుగా ఉన్న రహదారిపై రోజూ వందల సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఈ మలుపుల వద్ద సిగ్నల్స్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు ఆర్అండ్‌బీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజుపాలెం నుంచి రామచంద్రపురం రోడ్డులో..

రాజుపాలెం–రామచంద్రపురం ప్రధాన రహదారిలో 6 కిలోమీటర్ల పరిధిలో నాలుగు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. చిల్లంగి–వేలంక ప్రధాన రహదారిలో రెండు మలుపులు ఉన్నాయి. రాజుపాలెం –ముక్కొల్లు ప్రధాన రహదారిలో మూడు మలుపులు ఉన్నాయి. ఈ నాలుగు ప్రధాన రహదారుల్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రధానంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. రాత్రులు ఈ రహదారులపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే. రాజుపాలెం నుంచి ప్రత్తిపాడు వెళ్లే సుమారు 7 కిలోమీటర్ల ప్రధాన రహదారిపై జెడ్ ఆకారంలో మూడు మలుపు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ మార్గంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల వేగం తగ్గించే స్టాపర్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



మలుపుల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే ములపులో అదుపుతప్పి ఎక్కడ పడిపోతామో అన్న భయాందోళన కలుగుతోంది. అధికారులు స్పందించి సిగ్నల్స్ బోర్డులు ఏర్పాటు చేయాలి.

–బందారు ప్రసాద్, రామచంద్రపురం

తుప్పలు తొలగించాలి



ప్రమాదకరమైన మలుపులు వద్ద ఉన్న చెట్లు, తుప్పలను తొలగించాలి. మలుపును సూచించే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. తాత్కాలిక జంగిల్ క్లియరెన్స్ కాకుండా శాశ్వత చర్యలు చేపట్టడం వల్ల సమస్య పరిష్కారమవుతుంది.

– అల్లు శివరామకృష్ణ, గోనేడ

31న ఆదివాసీ సంఘ రాష్ట్ర మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న రేచుకట్ల సింహాచలం

ప్రత్తిపాడు: అనకాపల్లిలో ఈ నెల 31న ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం రాష్ట్ర మొదటి మహాసభ నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర నాయకుడు రేచుకట్ల సింహాచలం తెలిపారు. ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గస్థాయి ఆదివాసీ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌లో భాగంగా భూమి కోసం, భుక్తి కోసం, హక్కుల కోసం పోరాడుతున్న ఆదివాసీలను చంపుతోందని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ భూములను మైనింగ్ మాఫియా, కార్పొరేట్ మాఫియాలకు అప్పజెప్పుతున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలు యథేచ్ఛగా గిరిజనుల భూములను దోచుకుంటున్నాయని ఆరోపించారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ సంఘ నాయకులు ఒనుగుల సీతయ్య, సోమల శ్రీనివాస్, కురిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పెద్దపీట



ఇందుగపల్లిలో రామరాజు కట్టును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- కోటనందూరు మండలంలో పర్యటన

కోటనందూరు: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. కోటనందూరు మండలంలో కలెక్టర్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఇండుగపల్లిలో పదేళ్ల క్రితం కొట్టుకుపోయి శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్న రామరాజుకట్టును పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడి కట్టు కొట్టుకుపోవడానికి కారణాలు, కట్టుకింద ఉన్న ఆయకట్టు, సాగులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కట్టు నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఇరిగేషన్ డీఈతో చర్చించారు. ఖరీఫ్ అవసరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిళ్లనందూరులో మినీ గోకులం, పల్లెపండుగలో నిర్మించిన సీసీ రోడ్డు, నీటి తొట్టెలను పరిశీలించి పొందుతున్న ప్రయోజనంపై రైతులు, గ్రామస్తులను ఆరా తీశారు. మండల కేంద్రం కోటనందూరులో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, పీహెచ్‌సీ, పోలీసుస్టేషన్లను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి పలు అంశాలపై అధికారులను ఆరా తీశారు. తాండవ నదిపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. గడువులోగా బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకు రావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అల్లిపూడి రోడ్డులో ఉన్న రైతు దాడి చెల్లారావు ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. ఆయిల్ పామ్ సాగుతో పొందుతున్న ఆదాయం, ప్రభుత్వ ప్రోత్సాహంపై రైతును ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీఓ వెంకటనారాయణ, ఈఓపీఆర్డీ జయరాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివాజీ, హెచ్ఓ జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న వీర్ల సూరిబాబు దంపతులు



ఆలయంలో ప్రతిష్ఠించిన పద్మావతి, అలిమేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలు

అన్నవరం: స్థానిక సాయిబాబా గుడి వద్ద రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 6.31 గంటలకు శ్రీలక్ష్మీ గణపతి, శ్రీసీతారాములు, శ్రీలక్ష్మణస్వామి, శ్రీహనుమాన్, పద్మావతి, అలివేలు మంగాసమేత వేంకటేశ్వర స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. పురోహితులు దేవులపల్లి మూర్తి పంతులు ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త వీర్ల సూరిబాబు దంపతులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు, లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సుమారు ఆరు వేల మందికి అన్నదానం నిర్వహించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జనసేన నాయకులు వరుపుల తమ్మయ్యబాబు, మేడిశెట్టి బాబీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాలయానికి పార్టీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.పది వేలు విరాళాన్ని అందజేశారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడు గున్నబ్బాయి మృతి

కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



గున్నబ్బాయి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: మండలంలోని వల్లూరు గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చేపల గున్నబ్బాయి (60) గుండెపోటుతో మృతి చెందారు. రోజులాగే మంగళవారం తునిలో కర్రల (చెక్కల) వ్యాపారం చేసేందుకు వెళ్లిన ఆయన రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎస్.అన్నవరం దాటిన తర్వాత మార్గం మధ్యలో గుండె నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. దీంతో సహచరులు తునిలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. 2014–19 మధ్యకాలంలో ఆయన వైఎస్సార్ సీపీ నుంచి వల్లూరు ఎంపీటీసీ సభ్యుడిగా పని చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలియడంతో బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా గున్నబ్బాయి పార్థివ దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ కుర్ర సీతారామస్వామి, ఎంపీటీసీ తాతారావు, తుని చెక్కల వర్తక సంఘం నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్ర నాగేశ్వర రావు, పుల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



చేపల గున్నబ్బాయి (ఫైల్)

వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

గండేపల్లి: వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వైఆర్కే శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాటు తుపాకులు, బాంబులు, విద్యుత్ తీగలు ఉపయోగించి వన్య ప్రాణులను వేటాడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఎవరైనా నాటు బాంబుల తయారీ, విద్యుత్ ఉచ్చులకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా నాటు తుపాకులు ఉన్నవారు తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు.

వన్యప్రాణులను వేటాడే వారి సమాచారం ఇవ్వండి

జగ్గంపేట: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో అడివి జంతువులను వేటాడే వారి సమాచారం అందించాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు గ్రామ అధికారులకు లెటర్స్ పంపారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ వైర్లు అమర్చడం, నాటు తుపాకులు వాడడం లాంటి చర్యలకు కొంతమంది పాల్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ ఉచ్చులు తగిలి పలువురు మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. మూగ జీవాలు బలైపోతున్నాయని, వన్యప్రాణులు వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగ్గంపేట మండలం నరేంద్రపట్నంలో వన్యప్రాణులను వేటాడే నలుగురు వ్యక్తులపై బైండవర్ కేసులు పెట్టినట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మండపంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ముద్రగడ గిరిబాబు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు

శంఖవరం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు సూచించారు. మండలంలోని మండపంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్టీలో పదవులు పొందిన ప్రతిఒక్కరూ గ్రామ స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో మమేకమై సమన్వయంతో పని చేయాలన్నారు. కూటమి పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక చంద్రబాబు చేతులెత్తేసారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం, ఉప సర్పంచ్ నక్కా మాణిక్యం, మండల కన్వీనర్ నరాల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాల్లో లారీ, జేసీబీ సీజ్

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో గ్రావెల్ తవ్వకాలపై మైన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక లారీ, జేసీబీని అధికారులు స్వాధీనం చేసుకుని, స్థానిక రెవున్యూ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. దాడుల్లో మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ సత్యతేజ, మైన్స్ సర్వేయర్ శ్రీధర్ పాల్గొన్నారు.

తలుపులయ్య కుటుంబానికి పరామర్శ



పెద్దింటి తలుపులయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ గత నెల 25న మృతి చెందిన పెద్దింటి తలుపులయ్య కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబు బుధవారం పరామర్శించారు. తలుపులయ్య కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే స్థానిక విశాలాంధ్ర విలేఖరి సత్తి బాలకృష్ణను ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. బాలకృష్ణ తండ్రి పశుపతిరావు ఇటీవల మృతి చెందారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మధుబాబు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ పెద్దింటి నారాయణరావు పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి



బెండపూడి శివారులోలో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

- ఉగ్రరూపం దాల్చుతున్న భానుడు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు

ఏలేశ్వరం/తొండంగి: ఎండలు మండిపోతున్నాయి. కొద్ది రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి తాపానికి తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రహదారులు బుధవారం నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలకు ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా రోడ్లపై జనసంచారం తగ్గింది. ఎండలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉండడంతో ప్రజలు ఇళ్లవద్దనే ఉంటున్నారు. గ్రామీణ, జిల్లా రహదారులతో పాటు జాతీయరహదారులు కూడా వాహనాల రాకపోకలు లేక ఖాళీ దర్శనమిచ్చాయి. ఏలేశ్వరం పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం రోడ్డు, హనుమాన్ జంక్షన్, లింగంపర్తి రోడ్డు జనసంచారం లేక వెలవెలబోయాయి.

ఎంపీపీ చొరవతో రోడ్డుకు మోక్షం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నేత వీరబాబు

గోకవరం: స్థానిక ఇందిరమ్మ మోడల్ కాలనీలో (ఎరకల దిబ్బ) రోడ్డుకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు చొరవతో మోక్షం లభించింది. కాలనీ ఏర్పడిన సుమారు 18 సంవత్సరాల తరువాత సీసీ రోడ్డును నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ మోడల్ కాలనీని ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అప్పట్లో కాలనీలో గ్రావెల్ రోడ్లు నిర్మించగా కాలక్రమేణా పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించారు. అయితే ఓ వీధి రోడ్డు తుప్పలు, మురుగునీటితో నిండిపోయి నడవడానికి కూడా వీలు లేకుండా మారింది. ఎంతో మంది పాలకులు వచ్చినప్పటికీ రోడ్డును నిర్మించకపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇటీవల సమస్యను స్థానికులు ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లడంతో రోడ్డును పరిశీలించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. బుధవారం సీసీ రోడ్డును నిర్మించారు. రహదారి నిర్మాణ పనులను ఆద్యంతం ఎంపీపీ దగ్గర ఉండి పర్యవేక్షించారు. సుమారు రెండు దశాబ్దాల తరువాత రోడ్డుకు మోక్షం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ శ్రీవల్లి, ఆమె భర్త వీరబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామన్నారు. ఇప్పటికే మండల పరిషత్ నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.